# ధనమా?... హృదయమా?

రచయిత :

★ శ్రీ కు. జానకిరాం పట్నాయక్ ★

ఆశ!......ఈ రెండక్షరాల్లో ఎంత మహత్తు ఉందోగాని రాగినుంచి విరాగివరకూ దీనికి లోనుకాని వాడు లేడు. దీన్ని పిశాచంతో కొందరు పోల్చినారు! అది తప్పు! పిశాచం మంత్రబలంతో పారిపోతుంది. కాని ఆశమాత్రం మృత్యువాతపడే వరకూ పోదు!......ఇక ధనాశ ఉందీ అంటే దాని గురించి విపులీకరించటం ఎవరికీ సాధ్యంకాదు!

విశ్వనాథం పేరుపడ్డ వకీలు. పచ్చి అబద్ధాల్ని, చట్ట సమ్మతంపైన నిజాలుగాచేసి, న్యాయస్థానాల్లో వెదజల్లి, తన్మూలంగా సేకరించిన ధనరాసులు కొట్లలోనూ, పెట్టెల్లోనూ భద్రపర్చి కొన్ని లక్షలు చేసినాడు! కాని తనివి పోలేదు!! మరికొన్ని లక్షలకు ఆశ పీడిస్తూనే ఉంది!!!

శ్యామసుందరం ఆతని ఏకైక పుత్రుడు! ఎం. ఏ. మొదటి తరగతిలో పరీక్షనిచ్చి ఉద్యోగాన్వేషణలో నున్నాడు. తండ్రి తనవలె 'లా' చదివి వకీలు కమ్మంటాడు. తనేమో, ఉపాధ్యాయ వృత్తి నవలంబించి ప్రశాంత జీవితం గడుపుతానంటాడు. మొత్తం మీద నిరుద్యోగయే ఉన్నాడు!

ఆపదలూ, కష్టాలూ మంచివారికే వస్తూంటవి. దుర్మార్గుల చెంతకు అవి చేరనేచేరవు! భగవంతుడే వారికి దూరంగా నుంటుంటాడు!! తక్కినవారి సంగతియేంటి? శ్యామసుందరం భార్య శ్రీరమ, వారందినాలు జ్వరంతోనూ, దగ్గుతోనూ బాధపడి కాస్త నయంచెంది, అకస్మాత్తుగా మరణించింది! ఆమె చావు ఆతనికి ఉరుమని పిడుగై హృదయానికి తాకింది!!!

శ్రీరమ కాలినచితి ఇంకనూ చల్లారనేలేదు! విశ్వనాథం కుమారునికి రెండో పెండ్లికై ప్రయత్నిస్తున్నాడు! ఆయన అన్నదే తడవు దినానికి వంద సంబంధాలు వచ్చి పడుతున్నాయి!...కాని?...

శ్యామసుందరం, శ్రీరమను గోల్పోయిన నాటి నుంచీ జడునిలా తిరుగుతున్నాడు! ఆ జడత్వం కేవలం తత్కాలిక వైరాగ్యంకాదు!! నిజహృదయ పరివర్తన!!!

స్మృతి చిహ్నంగా, అర్థాంగి విడిచిపోయిన నాలుగేండ్ల పాప ఆతని యిహసౌఖ్యాలకు కేంద్రమై ఉంది!

తలిదండ్రులు వేసిన ప్రశ్నకు "నాసర్వస్వం నా పాపే! తక్కిన విషయాల్లోనికి నన్నీడ్చకండి!" అని ఖచ్చితంగా జవాబిచ్చి నిశ్చింతగా ఉంటుండేవాడు! ఆ జవాబు విని తల్లి, తలత్రిప్పి పెదవి విర్చేది! తండ్రి వ్యంగ్యంగా నవ్వి శిరఃకంపం చేసేవాడు!

"ఇదేంటండీ వీడి వాలకం?" అని ప్రశ్నించేది తల్లి!

"భయపడకే! మరి నాల్గు రోజులు పోతేసరి! ఆ కాస్త వైరాగ్యమూ చల్లారిపోతే వాడే దారికివస్తాడు" అని జవాబిచ్చేవాడు తండ్రి!

మూడు మాసాలు గడిచినాయి! శ్యామసుందరంలో అణుమాత్రమైనా చలనం లేదు!!

♦ ♦ ♦

రాత్రి పండ్రెండు దాటింది! పాపకు జ్వరం వచ్చింది! ప్రక్కనే పరున్న శ్యామ సుందరం అలజడితో లేచి ఉష్ణమానంతో చూపినాడు. నూట రెండు చూపిందా గాజుగొట్టం!!

కేలండరువేపు ఆతని దృష్టిపోయింది! అదే వారం!...అదేతిథి!...గడియారం చూసినాడు!...అదే సమయం!...

శ్రీరమకు కూడ తొలుదొల్త జ్వరం రావటం అదే సమయం...అదేవారం...అదేతిథి...అదే విధంగా అనుకోకుండా అకస్మాత్తుగా!...పాపకు కూడా ఇప్పుడు అదేరకంగా...ఓః!...అయితే?

ఆతలంపుతో శ్యామసుందరం హృదయం చెల్లా చెదురైపోయింది ! అప్రయత్నంగా కండ్లలో నీరు క్రమ్ము కుంది !! వెనక్కు తిరిగి, తటాలున పాపమీద వ్రాలి "పాపా !" అని రుద్ధకంఠంతో కేకవేసినాడు !!!

"అమ్మా !" అంటూ కలవరించి నిద్రలేచింది పాప ! శ్యామసుందరం పాపను హృదయానకు హత్తుకొని, వీపు మీద తట్టుతూ, "ఏం తల్లీ ?" అని అడిగినాడు.

"నాన్నా ! అమ్మ వచ్చింది !...ఏదీ ?...ఎక్కడకు వెళ్ళి పోయింది ? ...చూపించవూ ?" అన్నది పాప !

వచ్చిన దుఃఖాన్ని దిగమ్రింగి "లేదమ్మా ! అమ్మ ఇంకారాలేదు...మామయ్య గారింటికి వెళ్లింది కదూ !... వస్తుంది తల్లీ !" అని ఓదార్చినాడు. "లేదు నాన్నా !... ఇప్పుడు చూసినాను...అమ్మ వచ్చింది. 'పాపా' అని పిల్చింది ! ఎక్కడో దాక్కొనింది కావాలి ? చూపించవు నాన్నా !" అని అడిగింది ! ఆమాటలు వినేసరికి అతని కండ్ల వెంట నీరు వరదలై పారజొచ్చింది ! దుఃఖంతో గొంతుకు పూడుకుపోయింది !!

తండ్రి నుంచి జవాబు రాకపోవటం గమనించి పాప ఆతని భుజం మీదునుంచి లేచి ఆతని ముఖం చూసింది ! ఆ కన్నీటి ధారలు, ఆ పసినిసుగు మనస్సును కల్లోల పెట్టింది !! ఆ చిన్ని చేతుల్తో, ఆ దీటిని తుడుస్తూ" పోనీలే నాన్నా ! అమ్మ గురించి అడిగితే యేడుస్తావ్ ! మరెప్పుడూ అడగనులే నాన్నా !" అని తండ్రి కంఠాన్ని కౌగలించుకొంది !!

తెల్లవారింది ! పాప జ్వరం మరి ఒకటిన్నర డిగ్రీలు హెచ్చింది !!

డాక్టరు వచ్చినాడు ! పరీక్షచేసి ఇంజక్షను యిచ్చి, ధైర్యం చెప్పి వెళ్ళినాడు !! కాని సాయంత్రం సరికయినా ఒక అరడిగ్రీ తగ్గలేదు !!

రాత్రి అయింది ! తిరుగా డాక్టరు వచ్చినాడు ! తన విధాయక కృత్యం నెరవేర్చుకుపోయాడు !!

ఉన్నట్టుండి జ్వరం ఒక పెట్టున మరో డిగ్రీ హెచ్చిపోయింది ! శ్యామసుందరం కుప్పపెట్టున కూలి పోయాడు !!

పాప ప్రేలాపన ఆరంభించింది ! "అమ్మా ! రావే !...నన్నెత్తుకోవే !...అమ్మా బిస్కట్లూ, చాకొలెట్లూ ఇయ్యవే !...చూడమ్మా నాన్న రానీయలేదు !... మామయ్యగారింటికి నన్నూ తీసుకుపోవే !...నాకు భయం వేస్తుందే !...నేనుండనే !...అమ్మా !...అమ్మా !..." పడకనుంచి ఆమాంతంగా లేచిపోవటం, వారిస్తూన్న తండ్రిని రక్కటం, గిల్లటం !!

శేర్లకొద్దీ మంచు పాప తలమీద కరిగిపోతుంది ! కాని శరీరంలోని వేడి మాత్రం తగ్గలేదు !!

పాప అవస్థ ఇటు అయోమయంగా ఉంటూంటే అటు విశ్వనాథం, రెండో కోడలు రావటానికి ఏర్పాటులు చేస్తున్నాడు ! మనుమరాలి చావు బ్రదుకు లాతనికి, చీమ కుట్టినంతగానైనా అనిపించలేదు !! వచ్చిన సంబంధీకులతో, సేకరించబోయే కట్నం కానుకలూ, వెండి బంగారాలూ గురించి బేరాలాడ్డంలోనే ఆతని సమయమంతా సమాప్తి అయిపోతూంది !!

చివరకు కల్యాణదుర్గం జమీందారుని కుమార్తె స్థిరపడిపోయింది ! ఆమె మూలంగా మరో లక్షరూపాయిలు తన ఆస్తితో కలవనుంది !! విశ్వనాథం ఆనందానికి అంతులేకపోయింది !!!

♦ ♦ ♦

మధ్యాహ్నం నుంచీ లేచిన మేఘాలు, సాయంత్రానికి దట్టంగా అల్లుకొని ఉరుములు మెరుపుల్తో ధారాపాత వరషాన్ని కురిపిస్తూంది ! ప్రచండమారుతం దానికి తోడైంది !!...ఈ ప్రకృతి వైయధ్యం పాప పట్ల ప్రళయ రూపం దాల్చింది ! అకస్మాత్తుగా ఆ జ్వరం 99 డిగ్రీలకు దిగిపోయింది !!...డాక్టరు గాభరాపడ్డాడు ! ఇంజక్షనిచ్చినాడు !! రబ్బరు సంచుల్లో వేడి నీరెక్కించి, మెడ దిగువా రెండు ప్రక్కలనూ ఉంచినారు. ఉన్ని కంబళ్లు జోడించి కప్పినారు ! కొంచెం బ్రాందీకూడ త్రాగించినారు ! ఏదో పేరునకు కొంచెం ఉష్ణం యెక్కింది ! అదీ

మరి తక్కువ కాకుండా ఉంటే బాధ ఉండదని డాక్టరు చెప్పి వెళ్లి పోయినాడు !

కంటిమీద రెప్ప వేయకుండా శ్యామసుందరం పాప సేవచేస్తున్నాడు !

రాత్రి పది అయింది. తలుపుత్రోసిన చప్పుడు విని శ్యామసుందరం తలెత్తి చూసినాడు. మెల్లగ అడుగులు వేసుకుంటూ అతని తల్లివచ్చి, పాప మంచాన్ని సమీపించి "ఏలాగుందబ్బాయ్"? అని ప్రశ్నించింది. గట్టిగా మాటాడవద్దని సంజ్ఞచేసి ఆతడు, బ్రాందీని పాప గుండెలకు మెల్లగ మర్దిస్తున్నాడు. రెండు నిముషా లూరుకొని ఆమె కుమారుని చెంత కూచొని మెల్లగ ప్రసంగింప నారంభించింది !

"వారొచ్చినారు నాయనా !"

"ఎవరు ?"

"కళ్యాణదుర్గం జమీందారు !"

"ఎందుకు !"

"వాళ్లమ్మాయిని ఇస్తాంవని !"

"..............."

"నీ కట్నం కానుకలూ, మోటారూ, పిల్లకిచ్చే బంగారు వెండి నగలూ, పట్టుబట్టలూ అంతా లక్ష కిమ్మత్తు చేసే ఆస్తివస్తూంది !"

"..............."

"నీకూ నచ్చినట్టేనా ?"

"అమ్మా ! ప్రపంచంలో ధనమేనా ప్రధానం ?... హృదయం అక్కర్లేదూ ?"

"ఎందు కక్కర్లేదు ?... రెండూ ఉండాలె !"

"రెండూ ఉండటం అసంభవం అమ్మా ! ధనం ఉన్నవాళ్లకు హృదయం ఉండదు !"

"ఎందు కుండదు ?"

"ఏదీ ?...మీ కెక్కడుంది ?...లక్షరూపాయీలకే చూస్తున్నారు, గాని గతించిన మీకోడలు గురించి తలుస్తున్నారా ? దాని చితి యింకా ఆరనేలేదు !...తల్లిని గురించి బెంగపెట్టుకొని, మంచంపట్టి, చావు బ్రదుకుల్లో ఉన్న యీ పాపను చూస్తున్నారా ?...వీరిరువురు మూలంగా నేనెంత పరితపిస్తున్నానో గమనిస్తున్నారా ?...నిజంగా మీకు హృదయం అనే వస్తువే ఉంటే యిలా ప్రవర్తిస్తారా ?"

"(రూక్షంగా) అయితే చచ్చినవారితో చస్తాం వంట్రా ?"

"అలానైతే బాగానే ఉండిపోను ! ఈ దరిద్ర ప్రపంచం ఒక్కసారే తుదిముట్టిపోయి ఉన్ను !"

"ఇంతకూ నీవనేదేంటి ?"

"నాపాపను తప్పించి నాకీ ప్రపంచమే అక్కర్లేదు !"

ఆమె చివాలున లేచి బయటకు వెళ్లిపోయింది !... శ్యామసుందరం చెక్కిళ్లనుంచి కన్నీరు ధారలై పారసాగినాయి !!

♦ ♦ ♦

తెల్లవారింది ! పాప స్థితి మరీ అధ్వాన్నం అయిపోయింది !! ఊపిరితిత్తులనిండా కఫంచేరి, గొంతునుంచి గురక బయల్దేరింది !!

"దైవాధీనం !" అంటూ డాక్టరు, వేరొక ఇంజక్షనిచ్చి వెళ్లిపోయాడు !

శ్యామసుందరం కంటిలోని నీరింకిపోయింది ! చేష్టలుతప్పి, మంచంమీద కూర్చొని పాపముఖం వేపు చూస్తున్నాడు !!......

మధ్యాహ్నం గడిచింది !...సాయంత్రమైంది !... రావలసిన డాక్టరు రాలేదు !!!...హృదయంలో కీడు సమ్మెటపెట్లు పెడుతూంది !!!!...

ఒక గాలి విసురు కిటికీని త్రోసుకొని, గదిలో జొరబడ్డది !...'తపీ' మని టేబిలు దీపం ఆరిపోయింది !!

"అమ్మా" అని పాప పొలికేక వేసింది !... "పాపా!" అని శ్యామసుందరం పాపను కౌగలించుకున్నాడు !!...

'దఢాల్' మని బయట పిడుగుపడ్డది ! వికృతంగా కూసి, దివాంధం "టప—టప" మని రెక్కలు విదళించుకొని వేరోచోటికి ఎగిరిపోయింది !!!

బయటవరండాలో విశ్వనాథం కర్కశధ్వని !... పిడుగుకన్నా కఠోరం !...దివాంధపు అరుపుకన్నా వికృతం !...

"అభాజనుడు ! లక్ష్మి తనంత తావస్తుంటే కాల దన్నిన మూర్ఖుడు !...చచ్చినవారితో చస్తానంటాడు ! ధనం విలువ వీడికేం తెలుసు ?...గడించాడా ? ఏడ్చాడా ?...హృదయం కావాలి వీడికి ?... దరిద్రుడు !..."

పాప శవాన్ని, చేతుల్లో ఉంచుకొని తండ్రి యెదుట నిల్చొని వికారంగా నవ్వుతూ "ధనం !...ధనం !!... ధనం !!!...లక్ష్మి !...తనంత తావస్తూంది !...రానీ !... రానీ ! ఎవరడ్డినారు ?...చచ్చిన వారితో చావు ?... బాగానే ఉన్న అలాచస్తే !...కాని ఎదురౌస్తుందా చావు ?...ధనం గడించటంవో మరి ?...ధనం విలువ కోడలూ అయిందికాదు !...పసినిసుగు పాపా అయింది కాదు !!...నేనయినా అవుతానా ?...కాను !... కాను !!...ముమ్మాటికీ కాను !!!...ధనం ఉన్నవాళ్లకు హృదయం ఉంటుందా ?...ఉండదు !...ఉండదు !!... ముమ్మాటికీ ఉండదు !!!" అని శ్యామసుందరం పరుగున వీధిలో పడ్డాడు !

విశ్వనాథం గ్రుడ్లు మిటకరించుకుంటూ, నోట మాటలేక, కొడుకు పోయిన త్రోవవేపే చూస్తూ నిల్చుండి పోయాడు !

అతని మెదడులో "ధనం ఉన్నవాళ్లకు హృదయం ఉంటుందా ?...ఉండదు !" అన్నమాటలు ప్రతిధ్వనిస్తున్నాయి !!

చక్కని కథలకు
"కథాంజలి" చదవండి


తలవెంట్రుకలలోనుంచి కనిపిస్తున్నదా ? అయితే రాలిపోతున్న వెంట్రుకల స్థానంలో కొత్తవి మొలవడం లేదన్నమాటే. ఇలాగ క్రమక్రమంగా వెంట్రుకలు రాలడం మూలంగా మీరు పూర్తిగా బట్టతల సంప్రాప్తిస్తుంది. బట్టతల, ముసలితనం చిహ్నాలను రెండింటిని రానివ్వకుండా మిమ్మల్ని కేశవర్ధిని సంరక్షించగలదు. అట్టిపరిస్థితిలో అనవసరంగా మీరు అనాకారానికి పాల్పడడం ఎందుకు ?

శరదృతువులో ఆకులు రాలిపోయినా, చెట్టు వసంతకాలంలో తిరిగి చిగురుస్తాయి. కాని, మనం ఒకదశలో అశ్రద్ధచేస్తే, ఒకసారిరాలిపోయినవెంట్రుకలు మళ్లీరావు. కాబట్టి, మీరు వెంట్రుకలను రాలిపోనివ్వక, కేశవర్ధినిని సకాలంలో ఉపయోగించి, యౌవనాన్ని కాపాడుకోండి. సకాలంలో—అని ఎందుకంటున్నామంటే, మీరుసరియైన సమయంలో కేశవర్ధినిని వాడక చేయకపోతే, మీవ్యాధి నివారణకు అవకాశాలను కోల్పోతారు. ఆవిధంగా పూర్తిగా బట్టతల అవడానికి తావిచ్చినవారౌతారు. అందువలన జాగుచేయకుండా, అమూల్యమైన కాలాన్ని శిరోవృద్ధికి వినియోగించుకోండి. ఇందుకై కాలం మించకపూర్వమే

# కేశవర్ధిని

ఉపయోగించండి !

కేశవర్ధిని అ. 14. కేశవర్ధిని పొంపు అ. 14.

తపాలా ఖర్చు, ప్యాకింగ్ ఛార్జి ప్రత్యేకం.
మా డీలర్లనుండి, లేక ఈ క్రిందివిలాసంనుంచి పొందవచ్చును.

## సౌత్ ఇండియా కెమికల్స్

**ఆర్. యస్. పురం, కోయంబత్తూరు.**